తనిఖీలు చేస్తున్నా.. నిర్లక్ష్యం వీడరే..!

- మారని ప్రయివేట్ బస్సు ఆపరేటర్ల తీరు
- 'కర్నూలు' ఎఫెక్ట్.. రవాణా శాఖ విస్తృత తనిఖీలు
- ఇప్పటివరకు ఐదు బస్సులు స్వాధీనం..143 పై కేసులు
- రూ.3.06 లక్షల జరిమానా వసూలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్నూలు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాల నిర్లక్ష్యాన్ని మరోసారి కండ్లకు కట్టింది. ఈ దుర్ఘటన నేపథ్యంలో మేల్కొన్న రవాణా శాఖ అధికారులు గ్రేటర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రయాణికుల భద్రతను గాలికొదిలేసి, నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న అనేక బస్సుల డొల్లతనం ఈ తనిఖీలలో బయటపడింది. అయితే, అధికారులు వరుస తనిఖీలు చేస్తున్నా.. ప్రయివేట్ బస్సు ఆపరేటర్స్ మాత్రం.. తమ బస్సుల్లో ఉన్న లోపాలను సవరించుకోవడం కానీ.. కనీస జాగ్రత్తలు తీసుకోవడం కానీ చేయడం లేదు. వాటితోనే రోడ్డెక్కడం అందరినీ కలవర పెడుతోంది.

ఉల్లంఘనలు ఇలా..

అనేక ప్రయివేట్ బస్సులు భద్రతా ప్రమాణాలను ఏమాత్రం పాటించడం లేదని ఆర్ టిఎ అధికారులు గడిచిన మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలలో తేలింది. అగ్నిమాపక పరికరాల (ఫైర్ సేఫ్టీ సిలిండర్లు) లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. చాలా బస్సుల్లో ఫైర్ సేఫ్టీ సిలిండర్లు లేకపోవడం, ఉన్నచోట డమ్మీ సిలిండర్లు ఉండటాన్ని అధికారులు గుర్తించారు. మరికొన్నింటిలో గడువు ముగిసినవిగా తేలింది. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు బయటపడటానికి వీలుగా ఉండే ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్లకు అడ్డంగా బెడ్లు, ఇతర సామాగ్రిని ఏర్పాటు చేసినట్టు గుర్తించారు. అంతేగాక ప్రమాద సమయాల్లో కిటికీ అద్దాలు పగలగొట్టి బయటపడేందుకు ఉపయోగపడే హామర్స్(సుత్తులు) చాలా బస్సులలో అందుబాటులో లేకపోవడం గమనార్హం. కర్నూలు ఘటన తర్వాత ప్రయాణికులందరిలో ఒకరకమైన భయాందోళన నెలకొంది.

కెపాసిటీకి మించి ప్రయాణికులు

అనేక బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేవని, డిజైన్లలో మార్పులు చేశారని, కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారని అధికారులు తేల్చారు. నిబంధనల ప్రకారం ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సిన చోట ఒకే డ్రైవర్‌తో సుదూర ప్రాంతాలకు బస్సులను నడుపుతున్న ఉదంతాలు కూడా వెలుగులోకి వచ్చాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నా.. వారిలో మార్పు కనిపించడం లేదని తెలుస్తోంది. గ్రేటర్ జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో వందలాది బస్సులపై కేసులు నమోదు చేసి, లక్షలాది రూపాయల జరిమానాలు విధించారు. అగ్ని ప్రమాద నిరోధక చర్యలు లాంటి కనీస జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదు. అగ్నిమాపక యంత్రాలు లేకుండా వందల కిలోమీటర్ల మేర బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. కర్నూలు ఘటన నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని రోజులపాటు ఈ తనిఖీలు కొనసాగించనున్నారు. మూడ్రోజులుగా రవాణా అధికారులు 200-300కుపైగా బస్సులను తనిఖీ చేసి.. 143 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఇందులో ఐదు బస్సులను స్వాధీనం చేసుకున్నారు. ఆయా బస్సుల నుంచి కాంపౌడింగ్ ఫీజు కింద రూ.3.06 లక్షల వరకు జరిమానా వసూలు చేశారు. ఈ తనిఖీల పరంపర కొనసాగుతుందని, ప్రయాణికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని అధికారులు స్పష్టం చేశారు.

ప్రభుత్వానికి నివేదిక

కర్నూలు ప్రమాదంపై ప్రాథమిక దర్యాప్తు జరిపి, క్షేత్రస్థాయిలో చేపట్టిన తనిఖీలలో వెలుగుచూసిన ఉల్లంఘనలపై ప్రభుత్వానికి రాష్ట్ర ఆర్‌టిఎ అధికారులు నివేదికను అందించినట్టు సమాచారం. బస్సుల్లో ఫైర్ అలారం, గ్లాస్ బ్రేక్ హామర్స్ వంటి కనీస భద్రతా పరికరాలు ఏర్పాటు చేసుకోవడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించొచ్చని రవాణారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కాకుండా, నిరంతరం తనిఖీలు చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించే బస్సుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎసిబికి చిక్కిన గ్రామ పరిపాలన అధికారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ పరిపాలన అధికారి (జిపిఒ) లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎసిబి డిఎస్‌పి వై.రమేష్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ములకలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో దాడులు నిర్వహించింది. జిపిఒ బానోత్ శ్రీనివాస్ నాయక్ పూసుగూడెంకు చెందిన ఓ రైతు వద్ద వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్, పాస్‌బుక్ ఇప్పిస్తానని చెప్పి రూ.60 వేలు లంచం డిమాండ్ చేశాడు. ముందుగా రూ.40వేలు తీసుకున్నాడు. ఈ విషయాన్ని రైతు.. ఎసిబి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా సోమవారం మిగిలిన బ్యాలెన్స్ రూ.15 వేలు బానోత్ శ్రీనివాస్ నాయక్ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జిపిఒ శ్రీనివాస్ నాయక్ గతంలో బూర్గంపాడు మండలంలో విఆర్‌ఒగా పనిచేశాడు. ఆ సమయంలో ఆయన.. పలు అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్నట్టు సమాచారం. ఎసిబి అధికారులు ఇతనిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు. ఎసిబి డిఎస్‌పి వై రమేష్ మాట్లాడుతూ బానోత్ శ్రీనివాస్ వ్యవహారంలో పై అధికారుల పాత్ర ఏమైనా ఉన్నదా అనే కోణంలో విచారిస్తున్నామని తెలియజేశారు.

వెల్ఫేర్ బోర్డే సంక్షేమ పథకాలు అందించాలి

ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీమ్‌లు అప్పగించొద్దు

- నవంబర్ 10న కార్మిక సంఘాల రౌండ్ టేబుల్
- భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఏసి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవన, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచే నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వ పథకాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఏసి డిమాండ్ చేసింది. సీఎస్‌సీ ద్వారా హెల్త్ టెస్టులను చేయించడాన్ని రద్దు చేయాలని కోరింది. సంక్షేమ పథకాల నిర్వహణను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేలా తీసుకొచ్చే జీవో 12ను వెంటనే సవరించాలని డిమాండ్ చేసింది. కార్మికులు సహజంగా చనిపోతే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను బోర్డు ద్వారా అందించాలని విజ్ఞప్తి చేసింది. నవంబర్ 10న కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో దేవేందర్‌రెడ్డి (ఎఐటియుసి) అధ్యక్షతన జెఏసి సమావేశం జరిగింది. అందులో వంగూరు రాములు (సిఐటియు), హన్మేశ్, సాంబశివుడు (టియుసిఐ), అనురాధ, యాదన్న (ఐఎఫ్‌టియు), ఐలన్న (బిఎన్‌ఆర్‌కెఎస్), కుమార్, చంద్రమౌళి (స్ఫూర్తి కార్మిక సంఘం), జెఏసి నాయకులు రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు. జేఏసీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా జెఏసి నేతలు మాట్లాడుతూ.. సహజ, ప్రమాదవశాత్తు మరణాలకు పరిహారం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం కలిగే వారికి ఆర్థిక సహాయం అందించే పథకాలను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం దారుణమని విమర్శించారు. మిగతా ఎనిమిది ప్రభుత్వ పథకాలను పూర్తిగా విస్మరించడం అన్యాయమని వాపోయారు. ప్రయివేటు బీమారంగ సంస్థలైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ. 250 కోట్లు, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.94 కోట్లు, ట్రెయిల్ బ్లేజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లు కట్టబెట్టడం అన్యాయమన్నారు. భవన నిర్మాణ కార్మికుల బోర్డు నిధులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే కుట్ర దీని వెనుక ఉందని విమర్శించారు. ప్రయివేటు బీమా కంపెనీలకు కట్టబెట్టిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2009 నుండి 2025 వరకు బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులు 28, లక్షల మంది ఉండగా 15 లక్షల మందికి మాత్రమే రెన్యువల్ చేయటం సరిగాదన్నారు. మిగతా 13 లక్షల మంది కార్మికుల రెన్యూవల్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కార్మికులకు హెల్త్ టెస్టుల పేరుతో సిఎస్‌సి సంస్థకు రూ.463 కోట్లు దోచిపెట్టారని విమర్శించారు. ఆ సంస్థకు నిధులివ్వడాన్ని ఆపేయాలనీ, ప్రభుత్వమే కార్మికులకు హెల్త్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు సలహా మండలిని వెంటనే నియమించి బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొంథా తుపాను ప్రభావంపై అప్రమత్తం

- రైతుకు నష్టం కలగకుండా అన్ని చర్యలు
- ధాన్యం చెడిపోకుండా టార్పాలిన్‌ల వినియోగం
- కొనుగోలు ధాన్యం వెంటనే మిల్లులకు తరలింపు
- ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొంథా తుపాను ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశముండటంతో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. వానాకాలం ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు దెబ్బ తినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లాల కలెక్టర్లనువీడియో కాన్ఫరెన్స్‌లో అప్రమత్తం చేశారు.

ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిలోనూ రైతులు నష్టపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని అందుబాటులో ఉన్న టార్పాలిన్‌లను వినియోగించి చెడిపోకుండా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించేందుకు అవసరమైన రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల వరకు ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలు సంభవిస్తున్న నేపథ్యంలో వరి కోతలు నిలిపి వేస్తే రైతులకు ఇబ్బంది ఉండదని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించిన నేపథ్యంలో ఇప్పటికే 4,428 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు తెలిపారు. మిగిలిన 3,814 కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్నారు. సోమవారం నాటికి 22,433 మంది రైతుల నుంచి 1,80,452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. అందులో దొడ్డు రకం 73,628 మెట్రిక్ టన్నులు, సన్నాలు 1,06,824 మెట్రిక్ టన్నులున్నాయనీ, వాటి విలువ విలువ రూ.431.09 కోట్లు అని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ జరపాలనీ, కొనుగోలులో రైతులకు ఎక్కడా ఆటంకాలు కలుగకుండా చూడాలన్నారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు సందర్శించి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

అవినీతి ఉపేక్షించం

ధాన్యం కొనుగోలు సమయంలో అవినీతి చోటు చేసుకుంటే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. అవినీతి ఆరోపణలు వస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఈ తరహా ఆరోపణలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. తమ ప్రభుత్వం రైతుపక్షపాత ప్రభుత్వమని గుర్తుచేశారు. ఏ కారణం చేత నైనా సరే.. రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, కమిషనర్ గోపి, పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ హనుమంతు కొండుబా, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి పాల్గొన్నారు.

వికలాంగుల కోసం స్వయం సహాయక సంఘాలు

- ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం పెంచేలా సర్కారు అడుగులు
- ఇప్పటికే 4800 సంఘాల ఏర్పాటు... 50 వేల మందికిపైగా సభ్యుల చేరిక
- మంత్రి సీతక్క చొరవతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్న సెర్ప్
- త్వరలో లాంఛనంగా ప్రారంభించనున్న సిఎంరేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇప్పటికే విజయవంతమైన మహిళా స్వయం సహాయక సంఘాల నమూనాను ఆదర్శంగా తీసుకుని వికలాంగులకు ఆర్థిక స్వావలంబన కలిగేలా, సామాజిక గౌరవం పెరిగేలా రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తున్నది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ప్రత్యేక కేంద్రీకరణ పెట్టి వారి కోసం సెర్ప్ ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించేలా చర్యలు మొదలు పెట్టారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,800 దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటయ్యాయి. ఆ సంఘాల్లో సుమారు 50 వేలకు పైగా సభ్యులు చేరారు. ఒక్కో గ్రూపులో కనీసం ఐదుగురు సభ్యులుండేలా సెర్ప్ అధికారులు చూస్తున్నారు. ఈ సంఘాల్లో పురుషులు, మహిళలు చేరొచ్చు. అయితే, మహిళా సాధికారతను దృష్టిలో ఉంచుకుని సంఘాలకు అధ్యక్షులుగా మహిళలే ఉండేలా నిబంధనలు రూపొందించారు. దీని ద్వారా మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు నిర్ణయాధికారంలో వారికి ప్రాధాన్యత లభించనున్నది. తద్వారా వికలాంగుల్లో సమూహ భావన, పరస్పర సహకార స్ఫూర్తిని పెంపొందుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఈ సంఘాల ద్వారా సభ్యులు చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు పొందే అవకాశాలను సెర్ప్ కల్పించనున్నది. బ్యాంకు లింకేజీ సౌకర్యం ద్వారా రుణ సదుపాయాలు, ఆదాయవృద్ధికి తోడ్పడే ఆర్థిక సహకారం కూడా చేయనున్నది. దీనిపై సెర్ప్ ఇప్పటికే క్షేత్ర స్థాయి అధ్యయనం పూర్తి చేసి, ప్రత్యేక అధికారులను నియమించింది. త్వరలో దివ్యాంగుల సంఘాల ఖాతాల్లో రివాల్వింగ్ ఫండ్ జమ చేయనున్నది. మహిళా సంఘాల తరహాలోనే వికలాంగులకు చెందిన స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని అధికారికంగా సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు వేగంగా జరుగుతున్నాయి.

వికలాంగుల ఆర్థిక సాధికారతే లక్ష్యం : మంత్రి డాక్టర్ సీతక్క

తెలంగాణలో వికలాంగుల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుతో ఇతరుల మాదిరిగా వికలాంగులు కూడా ఆర్థికంగా ఎదిగి, సమాజంలో గౌరవస్థానం సంపాదిస్తారనే విశ్వాసముంది. సొంత ప్రతిభ, కృషి, పట్టుదలతో వారు జీవితాన్ని నిర్మించుకునే దిశగా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. వారికి సమాన అవకాశాలు కల్పించే సమానత్వ దృక్పథంతో తమ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. వారికి తగిన అవకాశాలు, ప్రోత్సాహం ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యం.

మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రాక్టికల్ కేంద్రాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలని టిఎంఎస్‌టిఎ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాను సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టిఎంఎస్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వామి, ఉపాధ్యక్షులు కార్తీక్ కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రయివేటు జూనియర్ కాలేజీలకు ప్రాక్టికల్ కేంద్రాలను కేటాయించి ప్రభుత్వ విద్యాసంస్థలైన మోడల్ స్కూళ్లు, గురుకులాలు, కెజిబివిలకు తొలగించడం సరైంది కాదని తెలిపారు. వాటిల్లో ల్యాబ్ పరికరాలు, సిసి కెమెరాలు, సరైన మౌలిక సదుపాయాలు అన్ని అందుబాటులో ఉన్నాయని వివరించారు. అర్హత కలిగిన అధ్యాపకులున్నారని తెలిపారు. ఈ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. ఇతర కాలేజీలకు వెళ్లి ప్రాక్టికల్ పరీక్షలను రాయాలంటే వారు భయభ్రాంతులకు గురవుతారని తెలిపారు. ఇంటర్ బోర్డు నిర్ణయం పేద విద్యార్థులకు అన్యాయం చేయడమే అవుతుందని పేర్కొన్నారు.

ఆ 11 మంది అభ్యర్థులకు వెయిటేజీ మార్కులు

- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్టాఫ్ నర్సుల పోస్ట్ పరీక్షలకు హాజరైన వాళ్లలో కోర్టుకు వచ్చిన 11 మంది అభ్యర్థులకు వెయిటేజ్ మార్కులు కలపాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వెయిటేజ్ మార్కులు కలిపిన అనంతరం పిటిషనర్లు ఉద్యోగాల భర్తీకి అర్హత సాధిస్తే గతంలో ఆదేశించిన మేరకు ఖాళీగా ఉంచి 11 పోస్టుల్లో వాళ్లను నియమించాలని సూచించింది. స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయకుండా 11 పోస్టులను ఖాళీగా ఉంచాలని గత జనవరిలో మధ్యంతర ఆదేశాలను జారీ చేశామని పేర్కొంది. వెయిటేజ్ మార్కులు కలిపాక పిటిషనర్లు అర్హత పొందితే వాళ్లను ఆ పోస్టుల్లో నియమించాలని వైద్య, ఆరోగ్య సర్వీసెస్ నియామక బోర్డును ఆదేశించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఓఎంఆర్ విధానానికి బదులు కంప్యూటరీకరణ ద్వారా పరీక్ష పెట్టి పోస్టుల భర్తీ ప్రక్రియను నిర్మల మరో 11 మంది వేసిన పిటిషన్లపై జస్టిస్ ఎన్. రాజేశ్వరరావు ఇటీవల తుది ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషన్లపై విచారణను క్లోజ్ చేశారు.

ఏం చర్యలు తీసుకునేదీ చెప్పండి

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్, గైరాన్ భూములను ఐఎఎస్/ఐపిఎస్ అధికారులు, వాళ్ల కుటుంబసభ్యుల పేరిట రిజిస్ట్రేషన్లు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో దీనిపై దర్యాప్తు చేయాలని ఈడీ పోలీసులకు రాసిన లేఖపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించిన బాధ్యులపై చర్యలు ఏం తీసుకున్నారో చెప్పాలని కోరింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లేఖ ఆధారంగా పోలీసులు ఏం చేయబోతున్నారో తదుపరి విచారణ నాటికి తెలియజేయాలంది. విచారణ నవంబర్ మూడో తేదీకి వాయిదా వేసింది. సర్వే నెంబర్ 181లోని కొంత భూమిపై యాజమాన్య హక్కు ఉందని దస్తగిర్ షరీఫ్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ సోమవారం విచారించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా ప్రభుత్వంలో ఉన్నతాధికారులుగా ఉన్నారనీ, తప్పుడు పత్రాలు, ఫోర్జరీలతో భూదాన్ బోర్డు భూమిని కాజేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిటిషనర్ వాదన. ఇడి లేఖపై పోలీసులు ఏం చేయబోయేదీ తెలుసుకుని వివరాలు చెప్పేందుకు గడువు కావాలని ప్రభుత్వం కోరింది. దీంతో విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

డ్రగ్స్ నిర్మూలనకు నిరంతరం పోరాడాలి

- మత్తుకు యువత దూరంగా ఉండాలి
- వ్యసనాలు ఆర్థిక విధ్వంసాన్ని సృష్టిస్తాయి
- ప్రొఫెసర్ ఎం కోదండరామ్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక రుగ్మతలకు మూలకారణమైన గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు నిరంతర పోరాడాలని టిజెఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎం కోదండరామ్ పిలుపునిచ్చారు. గ్రామాల్లోనూ యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో 'ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు' అనే నినాదంతో హైదరాబాద్ నిజాం కళాశాల ఆడిటోరియంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న కళాజాత బస్సు యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కోదండరామ్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి పిలువని చెడు స్నేహితులని, ఈ వ్యసనాలు మనిషి శరీరాన్ని, మెదడును, మనస్సును నియంత్రిస్తాయని తెలిపారు. ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, ఆ వ్యసనం నుంచి బయటపడటం చాలా కష్టమని చెప్పారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని, అవి ఆర్థిక విధ్వంసాన్ని సృష్టిస్తాయని, పర్యావరణానికి నష్టం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో అతి కొద్ది మంది సంపన్నులకే పరిమితమైన డ్రగ్స్ ప్రస్తుతం గ్రామాలకు చేరిందని, దాని నిర్మూలనకు విస్తృతమైన ప్రచారం చేపట్టాలని సూచించారు. బస్సు యాత్ర చేపడుతున్న ప్రజానాట్యమండలిని అభినందించారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎవి రాజశేఖర్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే భవిష్యత్ అంధకారంగా మారుతుందని, వ్యసనాలకు అందరూ దూరంగా ఉండాలని సూచించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి పట్ల రాష్ట్ర వ్యాప్తంగా మరింత అవగాహన కల్పించేందుకు బస్సు కళాజాత నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర భాష, సాంస్కృతిక, సామాజిక, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సలహా కమిటీ సభ్యులు పల్లె నర్సింహ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించేందుకు పాలమూరు, మహాత్మాగాంధీ, కాకతీయ, శాతవాహన, తెలంగాణ యూనివర్సిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. అంతకుముందు ఆడిటోరియంలో 'మనిషి విలువలు, డ్రగ్స్ బారిన పడుతున్న విద్యార్థులు' అంశంపై ప్రదర్శించిన వీధి నాటకం విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. డ్రగ్స్‌కు సంబంధించి పలు గేయాలను తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రేణుక, కో-ఆర్డినేటర్లు మంజుల, వెంకటేశ్వర్లు, సుదర్శన్, ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులు కె లక్ష్మీనారాయణ, కె ఉప్పలయ్య, సహాయ కార్యదర్శి ఎ రవి, కళాకారులు రాము, సైదులు, విజయ్, శ్యామ్, రాము పాల్గొన్నారు.

అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు

- రెండు రోజులే గడువు : బడుగు సైదులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంజెపి ద్వారా పిజెటిఎయు అనుబంధ కళాశాలలో (బిఎస్‌సి) అగ్రికల్చర్ కోర్స్‌లో ప్రవేశం కోసం ఈ నెల 21 నుంచి 29 వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీ) కార్యదర్శి బడుగు సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవటానికి రెండు రోజులే గడువు ఉందనిఆ కోర్సులో ప్రవేశం కోసం ఇంటర్ (బైపీసీ), దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు తెలంగాణ స్టేట్ టిజి ఇఎపిసెట్-2025 పరీక్షలో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే గ్రామీణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతలో వార్షిక ఆదాయం రూ. రెండు లక్షలకు మించకూడదని తెలిపారు. ఆసక్తి గల విద్యా ర్థులు https:// mjptbcwreis. telangana.gov.in, https://www.pjtau.edu.in వెబ్‌సైట్‌లను సందర్శించాలని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము రూ.1,000 ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలనీ, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు ఆఫీస్ పని దినాల్లో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు 040-23328266ను సంప్రదించాలని కోరారు. mjpadmissioncell@gmail.com కు మెయిల్ చేయాలని సూచించారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- లేకుంటే చలో హైదరాబాద్
- ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ
- 30న విద్యాసంస్థల, వర్సిటీల బంద్ జయప్రదం చేయాలని పిలుపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఆరేండ్ల నుంచి పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం కనీసం రూ.1200 కోట్లు అయినా విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసి, మెడికల్, ఇతర ప్రొఫెషనల్ విద్యాసంస్థలు, యూనివర్సిటీల బంద్‌కు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఎస్వీకేలో సోమవారం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు విలేకరుల సమావేశం నిర్వహించారు. బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.రజనీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరేండ్ల నుంచి సుమారు రూ.8 వేల కోట్లకుపైగా ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పి.. ఇప్పటి వరకు కనీసం వారు ఇచ్చిన టోకెన్ల నిధులు కూడా ఇవ్వలేదని వాపోయారు. విద్యాసంస్థల యాజామన్యాలు బంద్ ప్రకటించి సంవత్సరం కాలంగా పోరాడితే రూ.1200 కోట్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నాయని, లక్షలాది రూపాయలు చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు భరోసా ఇచ్చేలా ఫీజుల చెల్లింపు కోసం గ్యారెంటీ ఇచ్చి.. భవిష్యత్ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యసంస్థలు, ప్రొఫెషనల్ విద్యాసంస్థలు, యూనివర్సిటీల బంద్‌నిర్వహిస్తున్నామని, ఈ బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలు సహకరించాలని ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అశోక్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.మమత, రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, లెనిన్, హైదరాబాద్ జిల్లా నాయకులు నాగేందర్, స్టాలిన్ ఉన్నారు

'చేనేత' సమస్యలు పరిష్కరించండి

- పక్షం రోజుల్లో కాకుంటే నవంబర్ 20న మహాధర్నా
- చేనేత ముడిసరుకులు, ఉత్పత్తులపై జీరో జిఎస్‌టి వేయాలి : చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పక్షం రోజుల్లో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల 20న హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్ కమిషనర్ కార్యాలయం ముందు మహాధర్నా చెపడతామని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు అన్నారు. రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ లోని సహారా స్టేట్స్‌లో రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ అధ్యక్షతన సోమవారం తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రవేశపెట్టిన గత కార్యక్రమాల నివేదికపై చర్చించారు.

అనంతరం చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. చేనేత కార్మికుల రుణమాఫీ చేస్తానని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి దాదాపు ఏడాదిన్నర దాటిందని, ఎప్పుడు చేస్తారోనని కార్మికులు కండ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారని అన్నారు. పక్షం రోజుల్లో రుణమాఫీ చేయకపోతే నవంబర్ 20న నాంపల్లి హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్ కమిషనర్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. చేనేత చేయూత నగదు బదిలీ పథకం స్థానంలో చేనేత భరోసా పథకం అమలు చేయాలని నిర్ణయించి నెలలు గడుస్తున్నా చేయడం లేదన్నారు. నేతన్న బీమా పథకంలో వయసుతో నిమిత్తం లేకుండా బీమా ఇవ్వాలని నిర్ణయించడం సంతోషకరమైనా.. కార్మికులు మరణించి ఏడాది దాటినా బీమా అందించకపోవడం విచారకరమన్నారు.

చేనేత ముడి సరుకులు నూలు, రంగులు, రసాయనాలపై, చేనేత చీరలపై జీరో జిఎస్‌టి చేయాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు 12 ఏళ్ల నుంచి ఎన్నికలు జరపడం లేదని, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరవు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి సంవత్సరం దాటిందని గుర్తు చేశారు. సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించి టెస్కోకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు మాఫీ చేసి రుణాలను పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర సలహాదారు బడుగు శంకరయ్య, రాష్ట్ర కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షులు వనం ఉపేందర్, వర్కాల చంద్ర శేఖర్, సహారా నాయకులు శేఖరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కర్నాటి వెంకటేశం, గజం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

నకిలీ దంత వైద్యులపై చర్యలు తీసుకోండి

- డెంటల్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ దంత వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్ అండ్ సర్జన్స్ అసోసియేషన్ (ఎయిడ్సా) డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ మంజూర్ అహ్మద్ ఆధ్వర్యంలో నాయకులు తెలంగాణ డెంటల్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. అర్హత లేని వారు చట్ట విరుద్ధంగా నడుపుతున్న క్లినిక్‌లపై వెంటనే చర్యలు తీసుకోవాలనీ, నకిలీలకు సహకరిస్తున్న డెంటిస్టుల బిడిఎస్, ఎండిఎస్ డిగ్రీలను రద్దు చేయాలని వారు కోరారు. అనంతరం వారు హైదరాబాద్ లోని ప్రభుత్వ దంత కళాశాల ప్రిన్సిపాల్‌తో సమావేశమై నకిలీ దంత వైద్యంతో ఎదురవుతున్న సమస్యలను చర్చించారు. నకిలీ దంత వైద్యానికి బలికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని వారు కోరారు. ఎయిడ్స్ చేస్తున్న పోరాటానికి దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మద్ధతు తెలిపారు.

బిఆర్‌ఎస్ చేసిందేమీ లేదు

- మహిళ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లిహిల్స్ నియోజకవర్గానికి బిఆర్‌ఎస్ చేసిందేమి లేదని మహిళ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో చావు దెబ్బ తిన్న బీఆర్‌ఎస్ జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లోనూ అదే పరిస్థితిని ఎదుర్కొంటుందని తెలిపారు. మహిళలంటే గౌరవం లేని బీఆర్‌ఎస్ మహిళా సానుభూతితో గట్టెక్కాలని ప్రయత్నిస్తోందని ఎద్దేవా చేశారు. సొంతింటి మహిళ కవిత పట్ల కల్వకుంట్ల కుటుంబం ఏ విధంగా వ్యవహరిస్తున్నదో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ జూబ్లిహిల్స్‌ను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. 22 కేసులు, పిడి యాక్ట్ ఉన్న సల్మాన్ ఖాన్‌ను బిఆర్‌ఎస్ పార్టీలోకి ఎలా తీసుకున్నారని ఆమె ప్రశ్నించారు.

నేటినుంచి పిజి లాసెట్ తుదివిడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎల్ఎల్ఎం కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీలాసెట్ తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పాండురంగారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం నుంచి ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ (మొదటి విడతలో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు మాత్రమే)తోపాటు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఈనెల 31న అర్హులైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు. 31 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. అదేనెల ఐదో తేదీన సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. వచ్చేనెల ఆరు, ఏడు తేదీల్లో కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు చేరాలని సూచించారు. ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించాలని కోరారు. ట్యూషన్ ఫీజును చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాల కోసం https://lawcetadm.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

హక్కుల సాధనకు ఆశాలు ఐక్యంగా పోరాడాలి

- ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఐఎల్‌సి సమావేశాలు నిర్వహించాలి : జయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హక్కుల సాధన కోసం ఆశా వర్కర్లు ఐక్యంగా పోరాటం చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభ రెండో రోజు సోమవారం జెండాను ఆమె ఆవిష్కరించారు. ముగింపు సభలో, అనంతరం విలేకరుల సమావేశంలో జయలక్ష్మి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్లతో వెట్టిచాకిరీ చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 45వ లేబర్ కమిషన్ సమావేశాల్లో చర్చించిన సమస్యలను పరిష్కరించకుండా.. 11 సంవత్సరాల నుంచి ఐఎల్‌సి సమావేశాలు ఏర్పాటు చేయడం లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కార్మికులందరికీ 26000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీసం రోజుకు రూ. 175 ఉంటే సరిపోతుందని ప్రధానమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఆరోగ్య శాఖకు ఆరు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తామని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి సిఐటియు నిరంతరం పోరాడుతూ కార్మికులకు అండగా ఉంటుందని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ బలమైన యూనియన్ అని తెలిపారు. ప్రతి పోరాటంలోనూ ఆశా వర్కర్లు ఐక్యంగా కదులుతున్నారని చెప్పారు. సమరశీల పోరాటాల ద్వారా తమ హక్కులను సాధించుకోగలమని వివరించారు. రానున్న కాలమంతా పోరాటాల కాలమని, ఆశా కార్యకర్తలు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలాదేవి, సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వెంకటేశ్వర్లు ప్రసంగించారు. ఈ సభలో ఆశ వర్కర్ల యూనియన్ అధికార ప్రతినిధి కాసు మాధవి, సిఐటియు సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, అధ్యక్ష కార్యదర్శులు దీప్లానాయక్, నల్లవెల్లి కురుమూర్తి, రైతుసంఘం రాష్ట్ర నాయకులు ఎ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జగన్, కడియాల మోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మయ్య, నాయకులు వి.కురుమూర్తి, కురుమూర్తి, చంద్రకాంత్, వేణుగోపాల్, రాజ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్, భరత్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మీసాల కుర్మయ్య, ఉపాధ్యక్షులు ఆదివిష్ణు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గోనెల రాములు, జిల్లా ఉపాధ్యక్షులు తిరుమలయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రభాకర్, ఇతర ప్రజాసంఘాల నాయకులు కమర్ అలీ, నారాయణగౌడ్ పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న జయలక్ష్మి

ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- బిఆర్‌ఎస్ ఆటోడ్రైవర్ల ర్యాలీలో కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆటోడ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని వివధ ప్రాంతాల నుంచి బంజారాహిల్స్ లోని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్ కు ఆటో డ్రైవర్ల ర్యాలీ నిర్వహించారు. జూబ్లిహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఆటోలో కేటీఆర్ ప్రయాణించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆటోలో ఎన్నికలకు ముందు తీసుకెళ్లిన ఆటో డ్రైవర్ (అప్పుడు యజమాని) మస్రత్ అలీ ఆటోలో కేటీఆర్ ప్రయాణించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రయాణించిన ఆటో యజమాని రెండు ఆటోలను అమ్ముకుని డ్రైవర్ అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో రెండు ఆటోలను అమ్ముకునే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. మస్రత్ అలీ పరిస్థితి అడిగి తెలుసుకున్న కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని ప్రతిపక్ష పార్టీగా ఎండగడుతామని హెచ్చరించారు.

మరోవైపు గోకుల్ థియేటర్ నుంచి తెలంగాణ భవన్ చేరిన ర్యాలీని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడారు. ఆటోడ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో లభించిన సబ్సిడీలు, బెనిఫిట్స్ అన్ని నిలిచిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు అండగా నిలిచే పార్టీ బీఆర్‌ఎస్ పార్టీయేనని తెలిపారు. ఈ ర్యాలీలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మద్యం షాపుల లాటరీ

- 2,601 దుకాణాల కేటాయింపు
- వివిధ కారణాలతో 19 షాపుల డ్రా నిలిపివేత
- డిసెంబర్ 1 నుంచి అందుబాటులోకి కొత్త షాపులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 దుకాణాలకు వచ్చిన 95,137 దరఖాస్తులను 34 కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ల సమక్షంలో డ్రా తీసి 2,601 షాపులను కేటాయించారు. వివిధ కారణాలతో 19 దుకాణాల లాటరీ నిలిపి వేశారు. మండలం, జిల్లా, మున్సిపాల్టీ, కార్పొరేషన్ పరిధిలో షాపులు దక్కించుకున్న వారు రెండు రోజుల్లో నిర్దేశిత లైసెన్స్ ఫీజులో మొదటి విడుత చెల్లించి కన్ఫర్మేషన్ లెటర్ పొందాలని పేర్కొన్నారు. కొత్త షాపులు డిసెంబర్ ఒకటి నుంచి అందుబాటులోకి రానున్నట్టు అధికారులు తెలిపారు. 2027 నవంబర్ 30 వరకు రెండేండ్లు వీటి కాలపరిమితి ఉంటుందని తెలిపారు. 2023లో 1.32 లక్షల దరఖాస్తులు రాగా ఈసారి 37 వేలకు పైగా తగ్గాయి. రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు దరఖాస్తు ఫీజును పెంచడంతో పాటు పలు చోట్ల వ్యాపారులు సిండికెట్ కావడంతో తక్కువ అప్లికేషన్లు వచ్చినట్టు భావిస్తున్నారు. దరఖాస్తులు తగ్గినా ఫీజు పెంచడం వల్ల గతం కంటే రూ.200 కోట్ల వరకు అధికంగా ఆదాయం వచ్చింది. దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే మూడొంతులకు పైగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి దాని చుట్టు పక్కల ప్రాంతాల నుంచే రావడం గమనార్హం.

నిలిచి పోయిన షాపులకు నవంబర్ 3న డ్రా

వివిధ కారణాలతో నిలిచి పోయిన 19 మద్యం షాపుల డ్రా ను నవంబర్ 3న నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ఈనెల 28న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నవంబర్ ఒకటి వరకు ఐదు రోజుల పాటు దరఖాస్తులు సీకరిస్తారు. నిలిచి పోయిన వాటిలో ఆసిఫాబాద్ జిల్లాలో 7, అదిలాబాద్ జిల్లాలో 6, జయశంకర్ భూపాల జిల్లాలో 2, శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాలో 3, సంగారెడ్డి జిల్లాలో ఒక షాపు ఉన్నాయి.

'బారిష్ పూజ' పేరిట ఘరానా మోసం

- ప్రసాదంలో మత్తుమందు ఇచ్చి రూ.25 లక్షలతో ఉడాయింపు..
- నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బారిష్ పూజ చేస్తే పెట్టిన డబ్బుకు రెట్టింపు ఆదాయం వస్తుందంటూ అమాయకులను నమ్మబలికి ఘరానా మోసానికి పాల్పడిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. సోమవారం విలేకరుల సమావేశంలో మేడ్చల్ డిసిపి ఎన్ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. అబ్దుల్ ఖయ్యూమ్, మహ్మద్ ఇఫ్రాన్, గుగోలోత్ రవీందర్, కవిరా సాయిబాబా, ఠాకూర్ మనోహర్ సింగ్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. గండిమైసమ్మ చౌరస్తా మహావీర్ కాంప్లెక్స్‌లో నివసించే బసవరాజును "బారిష్ పూజ" పేరిట నమ్మించారు. "పూజలో పెట్టిన డబ్బు వర్ష రూపంలో రెట్టింపు వస్తుంది" అని చెప్పారు. ఈ నెల 18న మధ్యాహ్నం 3.30 గంటలకు పూజ నిర్వహించేందుకు ఒప్పించారు. వారిని నమ్మిన బసవరాజు పూజ సందర్భంగా రూ.25 లక్షలు వారికిచ్చాడు. పూజ అనంతరం నిందితులు ప్రసాదంలో మత్తు మందు కలిపి ఇవ్వగా.. అది తిని బాధితుడు స్పృహ తప్పి పడిపోయాడు. తర్వాత నిందితులు నగదుతో ఉడాయించారు. తేరుకున్నా బాధితుడు మోసపోయానని గ్రహించి అక్టోబర్ 21న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేడ్చల్ ఏసీపీ సీహెచ్. శంకర్ రెడ్డి, సీసీఎస్ ఏసీపీ వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దుండిగల్ సీఐ పి.సతీష్, డీఐ బాలరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ దర్యాప్తు ప్రారంభించారు. నలుగురు నిందితులను ఆదివారం గండిమైసమ్మ చౌరస్తాలో అరెస్ట్ చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు అబ్దుల్ ఖయ్యూమ్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.8.50 లక్షలు, ఎయిర్‌గన్, కత్తి స్వాధీనం చేసున్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి ఎన్ కోటిరెడ్డి

గొర్రెలను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

- 15 మూగజీవులు మృత్యువాత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రం లోతువాగు ప్రాంతంలో నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతి వేగంగా గొర్రెల మంద పైకి దూసుకెళ్లింది. దాంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ వాహనాన్ని ఆపి దిగిపోగా, సంఘటనా స్థలంలో కొంతసేపు ఆందోళన నెలకొంది. రోడ్డు మధ్యలో మృత్యువాత పడిన గొర్రెలు, గాయపడినవి పడి ఉండటంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ప్రయాణికులు, స్థానికులు సంఘటన చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న కొల్చారం పోలీసులు తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతి చెందిన గొర్రెల యజమాని ఆ దృశ్యం చూసి బోరున విలపించాడు. మహబూబ్‌నగర్ నుంచి బతుకుదెరువు కోసం గొర్రెలు మేపడానికి వస్తే అవి మృత్యువాత పడ్డాయని కన్నీటి పర్యంతమయ్యాడు.

బిఆర్‌ఎస్ మహిళా వ్యతిరేకి : సునీతారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ మహిళా వ్యతిరేక పార్టీ అని మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి నుంచి ఆమె ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే బీఆర్‌ఎస్ పార్టీ భరించలేకపోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి ఉన్నప్పుడు ఆటోడ్రైవర్ల కోసం ఏమీ చేయకుండా, ఇప్పుడు వారి పట్ల మొసలికన్నీరు కారుస్తున్నదని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ ఎన్ని నాటకులా ఆడినా సరే...జూబ్లిహిల్స్ లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.

ఎఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

- భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో..
- కామారెడ్డి పట్టణంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఎఆర్ కానిస్టేబుల్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి పట్టణంలోని అడ్లూర్ శివారులోని రాధాస్వామి సత్సంగ్ వెనకాల సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన రేకులపల్లి జీవన్‌రెడ్డి (37) ఎఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జీవన్‌రెడ్డికి ముస్తాబాద్ మండలం మొరాయిపల్లి గ్రామానికి చెందిన చందనతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గత మూడేళ్లుగా గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఏడాదిన్నర క్రితం చందన తన పుట్టింటికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఎన్నిసార్లు అడిగినా కాపురానికి రాలేదు. ఇటీవల విడాకుల నోటీసులు రావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

సోమవారం ఉదయం ప్రాంతంలో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బైకుపై ఇంట్లో నుంచి బయలుదేరారు. కాగా, కామారెడ్డి పట్టణంలోని అడ్లూర్ శివారులోని రాధాస్వామి సత్సంగ్ ఆశ్రమం వెనకాల మంటల్లో కాలిపోయిన మృతదేహం ఉండడంతో అది చూసిన పశువుల కాపరి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కామారెడ్డి సబ్ డివిజన్ ఎఎస్పి చైతన్యరెడ్డి, రూరల్ సీఐ రామన్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. జీవన్‌రెడ్డి మృతదేహంగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర ఘటనా స్థలానికి చేరుకుని మృతుని కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బువ్వ పెట్టలేం.. ఖర్చు భరించలేం..?

- మూడేళ్లుగా అందని నిధులు
- ఇక పాఠశాలలు నడపలేమంటున్న యాజమాన్యాలు
- విద్యార్థులను పాఠశాలకు అనుమతించని వైనం
- రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల తీరిది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉచిత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు బువ్వ పెట్టలేం.. వారి ఖర్చులనూ భరించలేం" అని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వంతో కరాఖండిగా చెప్పేస్తున్నాయి. 2019లో రాష్ట్రవ్యాప్తంగా 237 ప్రయివేటు పాఠశాలలను బెస్ట్ అవైలబుల్ పాఠశాలలుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో పేదలైన ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన 25 వేల మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించింది. వారికయ్యే భోజనం, వసతులతో పాటు స్కూల్ ఫీజులు భరించేందుకు సిద్ధపడింది. కానీ ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన నిధులు ఆయా పాఠశాలలకు విడుదల చేయకపోవడంతో విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. డిఇఒ, ఎంఇఒ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న పరిస్థితి ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో (బిఎఎస్) ఉచితంగా విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. లక్కీ డ్రా ద్వారా 1, 5 తరగతుల్లో విద్యార్థులను ఎంపిక చేస్తారు. 1వ తరగతిలో చేరితే పది వరకు డే స్కాలర్ కింద చదువుకోవాలి. 5వ తరగతిలో చేరితే గురుకుల పద్ధతిలో పదో తరగతి వరకు అదే పాఠశాలలో చదవాలి. డే స్కాలర్‌కు రూ.28 వేలు, గురుకుల పద్ధతికి రూ.42 వేలు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి చెల్లిస్తుంది. అలాగే ఇంటర్ రెండేండ్లకు గానూ రూ.1.25 లక్షలు చెల్లిస్తోంది. కాగా, గత రెండు, మూడేళ్లుగా బిఎఎస్ పాఠశాలకు విడుదల చేయాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాలకు రెండు విడతల నిధులు, 2025-26 సంవత్సరానికి మొదటి విడత నిధులను రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ పెట్టింది. అయినా వెనకడుగు వేయని పాఠశాలల యాజమాన్యాలు.. ఓ పక్క అప్పులు చేసి విద్యార్థులకు ఉచితంగా విద్య, నోట్ బుక్స్, హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నాయి. మరోపక్క నిధుల కోసం ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూనే వస్తున్నాయి. కానీ ప్రభుత్వం నేటికీ నయా పైసా విడుదల చేయలేదు. దాంతో విద్యార్థులకు బువ్వ పెట్టలేమని, చదువు చెప్పలేమని, ఖర్చులు భరించలేమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఎంతో కొంత ఫీజులు కట్టాలని, లేకపోతే ఇక పాఠశాలలను కొనసాగించలేమని విద్యార్థులను ఇంటింకి పంపించేస్తున్నారు. అంతా ఫ్రీ అనుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలో అర్థం కాక స్కూల్ యాజమాన్యాలతో చర్చించినా ప్రయోజనం లేకపోవడంతో విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆరు నెలల్లో పది రోజులే పాఠశాలకు...

మహబూబ్‌నగర్ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఉచిత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు కొందరు పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా కేవలం 10-15 రోజులు మాత్రమే పాఠశాలకు హాజరయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఉచిత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ పాఠశాల ఫీజు, రెసిడెన్షియల్ ఖర్చులతోపాటు యూనిఫామ్స్, బూట్లు, సాక్సులు, నోటు, టెక్స్ట్ పుస్తకాలు ఉచితంగా ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ ఏడాది విద్యార్థులని ఈ ఖర్చులన్నీ భరించాలని యాజమాన్యాలు ఆదేశించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కొందరు విద్యార్థులు కొన్ని పుస్తకాలనే తీసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో విద్యార్థులంతా పాఠ్యపుస్తకాలు కొనలేని పరిస్థితి దాపురించింది. పుస్తకాలు లేని కారణంగా క్లాస్‌రూమ్‌లో తోటి విద్యార్థుల ముందు అవమానాలకు గురవుతున్నామని భావించిన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడమే మానేశారని తెలుస్తోంది. విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ దుస్థితిపై జిల్లా అధికార యంత్రాంగం గానీ, ప్రజా ప్రతినిధులు కానీ పాఠశాల యాజమాన్యాలు కానీ బాధ్యత తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది.

దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఇక ఇంటికే..

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న 30 బెస్ట్ అవైలబుల్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 7వ తేదీన సమావేశం నిర్వహించి విద్యార్థులను పాఠశాలలకు రానివ్వమంటూ తీర్మానం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 11.47కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. కాగా దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులను తిరిగి పాఠశాలలు పున:ప్రారంభమైన తర్వాత పాఠశాలల్లోకి రానివ్వమని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి విద్యార్థులు రాకుండా అడ్డుకున్నారు. ముఖ్యంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థులు పాఠశాలకు రాకుంటే ఎలా చదువుకునేదంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేదని బయటికి పంపారు : అజయ్ కుమార్, 6వ తరగతి, రేడియం హైస్కూల్, వనపర్తి

ఉచిత విద్యను పొందుతున్న మాకు ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదని, మీరైనా డబ్బులు చెల్లించి రెసిడెన్షియల్‌గా ఉంటూ పాఠశాలల్లో విద్యను అభ్యసించాలని యాజమాన్యం చెప్పింది. డబ్బులు కట్టలేకపోతే పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోవాలని చెప్పారు. కాబట్టి అధికారులను అడుగుదామని డిఇఒ ఆఫీస్‌కు వచ్చాం .

ఆరు నెలల్లో పది రోజులే బువ్వ పెట్టారు : రాజు, 7వ తరగతి విద్యార్థి, మదనాపురం మండలం, కొత్తపల్లి గ్రామం

పాఠశాల ప్రారంభమై ఆరు నెలలు గడుస్తోంది. మొదటి పది రోజుల్లో మాత్రమే మాకు రెసిడెన్షియల్‌గా అవకాశం ఇచ్చి బువ్వ పెట్టారు. ఆ తరువాత డబ్బులు కట్టాలని ఇంటికి పంపించారు. రోజూ 40 కిలోమీటర్ల ప్రయాణించి పాఠశాలకు వస్తున్నాను.

ఖర్చులు భరించలేకనే.. : గద్దె భాస్కర్, రేడియంట్ హైస్కూల్, వనపర్తి

రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా బడ్జెట్ విడుదల చేయడం లేదు. రూ. 97 లక్షలు రావాల్సి ఉండగా ఈ ఏడాది మరో రూ.50 లక్షలు రావాల్సి ఉంది. 120 మంది పిల్లలకు వసతి కల్పిస్తున్నాను. డబ్బులు లేకుండా ఎలా మెయింటైన్ చేయాలి. జూన్‌లో బకాయిలు చెల్లించకుండా పిల్లల ఖర్చులు భరించలేం. రెండు మూడు నెలల్లోనే వస్తాయని కలెక్టర్ చెప్పడంతో ఒప్పుకున్నా. ఆరు నెలలైనా నయా పైసా రాలేదు. అందుకే డే స్కాలర్స్‌ను తీసుకుంటున్నాం. రెసిడెన్షియల్ పిల్లలను భరించలేమని చెప్పాం.



బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు బడ్జెట్ వెంటనే కేటాయించాలి : భరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను ప్రకటించి నిర్వహణ బాధ్యత మరిచింది. రెండేండ్లుగా నిధులు లేకుండా పాఠశాలల నిర్వహణ ఎలా సాధ్యం. పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం లేవు. తోటి విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారు. రెసిడెన్సీ లేక 30, 40 కిలోమీటర్లు రాలేక పాఠశాలకు రావడం మానేస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలలకు ఇవ్వాల్సిన బడ్జెట్ వెంటనే కేటాయించాలి.

సర్కారు నిర్ణయాన్ని చెప్పలేకపోతున్నాం.. : అబ్దుల్ ఘని, డిఇఒ, వనపర్తి

రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన విద్యా పాలసీ అది. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు రెండేండ్లుగా నిధులు రాకపోవడం నిజమే. అయినా పిల్లల విద్యకు ఎక్కడా ఆటంకం లేకుండా, వారిపై ఒత్తిడి చేయకుండా పాఠశాలల్లో కొనసాగనివ్వాలని యాజమాన్యాలకు సూచిస్తున్నాం. ఇంకొంతకాలం సర్దుకుపోవాలని సూచిస్తున్నాను.

యాజమాన్యాలు ఓపిక పట్టాలి : మల్లికార్జున్, ఇడి, ఎస్‌సి కార్పొరేషన్, వనపర్తి

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల కింద విద్యను అందిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు సృష్టించకుండా విద్యాబోధన చేయాలి. నిధుల విడుదలపై ప్రభుత్వానికి నివేదికను సమర్పించాం. యాజమాన్యాలు ఇంకొంతకాలం ఓపిక పట్టి విద్యార్థులకు సరైన విద్యా బోధన చేయాలి.